www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 46 | మంగళవారం | 30 జులై 2024



నేడు లంకతో చివరి టీ20

8 లో..

## తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో భారీ కుంభకోణం


- జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల గుర్తింపు
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌పై కేసు నమోదు
- అసెంబ్లీలో చర్చించనున్న ప్రభుత్వం



3 లో..

## ఢిల్లీ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ప్రమాదం

- సుప్రీంలో పిటిషన్ వేసిన విద్యార్థులు
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం
- రాజ్యసభలో ఛైర్మన్ ధన్‌కడ్ ఆవేదన
- అన్నిపక్షాలతో చర్చిస్తామని వెల్లడి



3 లో..

## బీజేపీ చక్రవ్యూహంలో ప్రజలు విలవిల

- భయం గుప్పిట్లో అన్ని రంగాల ప్రజలు
- అగ్నివీర్‌లను మోసం చేస్తోన్న ప్రభుత్వం
- ఆ ఇద్దరి ప్రయోజనం కోసం పనిచేస్తున్న మోడీ
- బడ్జెట్ ప్రసంగంలో రాహుల్ ఘాటు విమర్శలు
- తిప్పికొట్టిన ఎంపిలు, మంత్రులు

2 లో..



# విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో అవినీతి



విద్యుత్ విచారణ కమిషన్ ఏర్పాటుతో ముచ్చెమటలు

- విద్యుత్ విచారణ కమిషన్ ఏర్పాటుతో ముచ్చెమటలు
- కమిషన్ రద్దు చేయాలని కేసీఆర్ ఎందుకు కోర్టుకు వెళ్లారు
- విద్యుత్ సివిల్ పనులన్నీ అనుయాయులకు కేటాయింపు
- అసెంబ్లీలో గత ప్రభుత్వ విధానాలపై రేవంత్ విమర్శలు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాల విషయంలో సత్యహరిశ్చంద్రుడి తరువాత కేసీఆరే అన్నట్లు వాళ్లు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఛత్తీస్ ఘడ్, యాదాద్రి, భద్రాద్రి ఒప్పందాలపై వారే విచారణకు అడిగారని, వాళ్ల కోరిక మేరకే విచారణకు కమిషన్ నియమించామన్నారు.. కమిషన్ వద్దకు వచ్చి వివరాలు ఇవ్వాలని కోరితే కమిషన్‌పైనే ఆరోపణలు చేశారని విమర్శించారు. విచారణ కమిషన్ ముందు వాదన వినిపించకుండా కమిషన్ రద్దు చేయాలని కోర్టుకు వెళ్లారని, విచారణ కొనసాగించాల్సిందేనని సుప్రీంకోర్టు చెప్పిందని, అయితే కొత్త కమిషన్ చైర్మన్‌ను నియమించాలని న్యాయస్థానం చెప్పిందని సీఎంరేవంత్ రెడ్డి తెలిపారు. విచారణ కమిషన్‌కు కొత్త చైర్మన్‌ను సోమవారం సాయంత్రంలోగా నియమిస్తామన్నారు. తెలంగాణకు వాళ్లే ఏదో కొత్త వెలుగులు తెచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వైఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోనే హైదరాబాద్ నగరానికి నిరంతర విద్యుత్ సరఫరా జరిగిందని, ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆ ఆస్తులు

మిగతా 2 లో

"విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాటు తదితర విషయాల్లో అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. గత ప్రభుత్వ అక్రమాలను వెల్లడిస్తూ సిఎం రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. అలాగే విద్యుత్ కమిషన్ విసయంలో చైర్మన్‌ను మార్చాలని సుప్రీం సూచించిందే తప్ప.. విచారణను ఆపమనలేదని అన్నారు. విచారణ ఆపాలని కోర్టుకు వెళ్లిన కేసీఆర్.. ఎందుకు విచారణను అడ్డుకుంటున్నట్లో చెప్పాలన్నారు. ప్రశోత్తారాలపై చర్చను సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రద్దు చేశారు. ఆర్థిక నిర్వహణ , ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ డిమాండ్స్‌పై చర్చ చేపసట్టారు.

## అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా?

**అప్పులు చేయకుండా అభివృద్ధి ఎలా చేయాలి?**

విద్యుత్ స్థాపక శక్తిని పెంచిన ఘనత మాదే

నిజంగానే కేసీఆర్ సత్యహరిశ్చంద్రుడే

- పొలాలకు మీటర్లు పెట్టాలని చెప్పలేదు
- ఇందుకోసం 30వేల కోట్లు వదులుకున్నాం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టారన్న రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

వినియోగం ఆధారంగానే విభజన సమయంలో రాష్ట్రానికి విద్యుత్‌ను కేటాయించారు. రూ. 24 వేల కోట్ల అప్పుతో విద్యుత్ రంగం మా చేతికి వచ్చింది. అప్పులు చేయకుండా అభివృద్ధి ఎలా చేయాలి? అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా? అప్పులు చేస్తున్నామని అసెంబ్లీలో కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఏదో కొత్త విషయం చెప్పినట్లు ఇప్పుడు పదేపదే అప్పులు చేశారు అంటున్నారు' అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముమ్మాటికీ సత్యహరిశ్చంద్రుడే అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. రేవంత్‌లా సంచులు మోసే చంద్రుడు కాదు అని ఆయన పేర్కొన్నారు. నేను విద్యుత్ విషయంలో నిజనిజాలు మాట్లాడుతుంటే.. రేవంత్ రెడ్డినే వడివడిగా సభలోకి వచ్చి నాకు అడ్డు తగిలారు. సీఎం సభలో అడుగు పెట్టగానే తప్పుదోవ పట్టింది. కేసీఆర్ కాలు గోటికి వీరు సరిపోతారా..? కేసీఆర్ గురించి మాట్లాడిరది రికార్డుల నుంచి తొలగించండి.. సభను హుందాగా నడిపించాలి. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల వీరు ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నట్లు అని జగదీశ్ రెడ్డి అధికారపక్షాన్ని నిలదీశారు.

మిగతా 3 లో

## ఆత్మరక్షణలో పడ్డప్పుడల్లా అబద్ధాల ప్రకటనలు

సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం

సీఎం రేవంత్‌రెడ్డిపై హరీష్ రావు విమర్శలు

**ఖైరతాబాద్, ప్రజానావ:**

పాలకపక్షం ఆత్మరక్షణలో పడ్డప్పుడల్లా ముఖ్యమంత్రి సత్య దూరమైన అంశాలను లేవనెత్తుతూ సభను పక్క దారి పట్టిస్తున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మండిపడ్డారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో హరీశ్‌రావు చిట్ చాట్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ఇస్తామని అన్నారు. సభా నాయకుడు ఆదర్శంగా ఉండాల్సింది పోయి


మిగతా 2 లో



## చైనాతో సమస్యలను మేమే పరిష్కరించుకుంటాం

- మూడో దేశం ప్రమేయం కోరుకోవడం లేదు
- జపాన్ పర్యటనలో విదేశాంగ మంత్రి జైశంకర్

2 లో..



2 లో..

## లోక్‌సభ విప్‌గా కొండా విశ్వేశ్వర్ రెడ్డి




## ఆగస్టు 2న పదోన్నతి ఉపాధ్యాయులతో సీఎం భేటీ

ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ శాంతికుమారి సమీక్ష

**ఖైరతాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో ఇటీవల పదోన్నతి పొందిన 30వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 2న సమావేశం కానున్నారు. ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న సమావేశం ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం సంబంధిత ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగతా 2 లో



## 31న గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

7 లో..

## జిష్ణుదేవ్‌తో సీఎం రేవంత్ భేటీ

గవర్నర్‌గా రావడంపై అభినందనలు

2 లో..



# బీజేపీ చక్రవ్యూహంలో ప్రజలు విలవిల

- భయం గుప్పిట్లో అన్ని రంగాల ప్రజలు
- అగ్నివీర్‌లను మోసం చేస్తోన్న ప్రభుత్వం
- ఓ ఇద్దరి ప్రయోజనం కోసం పనిచేస్తున్న మోడీ
- బడ్జెట్ ప్రసంగంలో రాహుల్ ఘాటు విమర్శలు
- తిప్పికొట్టిన ఎంపిలు, మంత్రులు

**న్యూఢిల్లీ :** లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. బడ్జెట్ పై ప్రసంగం వేళ విపక్షనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో తీవ్ర దుమారం చెలరేగింది. ఇద్దరు ప్రముఖ పారిశ్రామికవేత్తలు దేశంలోని మౌలిక సదుపాయాలను నియంత్రిస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించడం ఇందుకు కారణమయ్యింది. వ్యాపారవేత్తల పేర్లను ప్రస్తావించడంపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల వాదనలతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజిజు.. రాహుల్‌కు సభానియమాలు తెలియవంటూ విమర్శించారు. అందుకు బదులిచ్చిన రాహుల్.. అధికార పక్ష నేతల వ్యవహారశ్కెలికి అనుగుణంగా స్పందిస్తామన్నారు. గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలో భయానక వాతావరణం నెలకొందన్నారు. చక్రవ్యూహం ద్వారా ఈ భయం వ్యాపిస్తోందన్న రాహుల్.. భాజపా ఎంపీలతో సహా రైతులు, కార్మికులు, ప్రతి ఒక్కరూ అందులో చిక్కుకుంటున్నారని అన్నారు. అగ్నివీర్‌లను కేంద్రం మోసం చేస్తోందన్న రాహుల్.. వీరి పింఛను కోసం బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేసినప్పటికీ.. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించలేదన్నారు. వేల సంవత్సరాల క్రితం హరియాణాలోని కురుక్షేత్రలో అభిమన్యుడిని చక్రవ్యూహంలో బంధించి హత మార్చారు. చక్రవ్యూహంలో హింస, భయం ఉంటాయి. అభిమన్యుడు అందులో చిక్కుకొని బల్కెపోయాడు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం చక్రవ్యూహాన్ని నిర్మిస్తే.. కుల గణన చేపట్టి దాన్ని విచ్ఛిన్నం చేస్తామని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తారాస్థాయిలో విరుచుకుపడ్డారు. 2024 బడ్జెట్ మధ్య తరగతి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం మధ్యతరగతికి ద్రోహం చేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాలను తొలగించి, మధ్యతరగతి ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ఆధునిక చక్రవ్యూహాన్ని నిర్మించిందని.. అందులో రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి వారు, సమాజంలోని ఇతర వర్గాలు చిక్కుకొని ఉన్నారన్నారు. దీర్ఘకాలిక లాభాలపై పన్ను విధించడంతో.. మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని వర్గాలను బీజేపీ భయపెడుతోందని ఆరోపించారు. కేంద్రమంత్రులతో పాటు నేతలు సైతం భయపెడుతున్నారని.. దేశవ్యాప్తంగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయని ధ్వజమెత్తారు. ట్యాక్స్ టెర్రరిజంతో వ్యవస్థ ఆగమవుతోందని అన్నారు. పలు రకాల ట్యాక్సుల పేర్లతో ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. పద్మవ్యూహం కమలం ఆకారంలో ఉంటుందని.. బీజేపీ గుర్తుని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు. పద్మవ్యూహం లాంటి కమలం పార్టీ దేశంలో అధికారంలో ఉందని, అందుకే రైతులు భయపడుతున్నారని అన్నారు. మహాభారతంలో పద్మవ్యూహాన్ని ఆరుగురు నియంత్రిస్తే.. ఇప్పుడు మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, అజిత్ దోవల్, అంబానీ, అదాని లాంటి వారు కంట్రోల్ చేస్తున్నారని నిప్పులు చెరిగారు. కేంద్రంలోని ప్రభుత్వం అదానీ, అంబానీల కోసమే ఉందంటూ రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఒకవైపు పేపర్ లీక్, మరోవైపు నిరుద్యోగ చక్రబంధంలో దేశం ఉందని.. ఇంటర్న్‌షిప్ వల్ల యువతకు ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. కాళ్లు విరగ్గొట్టి.. వీరీద బ్లాంకెట్ వేసినట్లు ఉందంటూ తూర్పారపట్టారు. అగ్నివీర్‌ల పెన్షన్‌కు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, మధ్యతరగతిని పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర ఇవ్వాలని రైతులు చాలాకాలం నుంచి అడుగుతున్నారని.. కానీ బ్జడెట్‌లో దాని ప్రస్తావనే లేదని నిప్పులు చెరిగారు. ఇదిలావుండగా.. రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అప్పుడు స్పీకర్ ఓంబిర్లా కలగజేసుకొని అభ్యంతరం తెలిపారు. ఒకరు ప్రసంగిస్తున్నప్పుడు ఇలా అడ్డుతగలడం సబబు కాదని.. సభా మర్యాదలను పాటించాలని కోరారు. ఈ క్రమంలో దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశమైన 'అగ్నిపథ్' పథకాన్ని రాహుల్ గాంధీ తప్పుదోవ పట్టిస్తున్నారని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇదే అంశంపై పార్లమెంటులో ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నాట్టు తెలిపారు. మరోవైపు బ్జడెట్‌పైనా విపక్ష నేత అపోహలు వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివరణ ఇస్తారని అన్నారు. 'దేశ సరిహద్దు రక్షణలో జవాన్లు నిమగ్నమై ఉంటారు. జాతీయ భద్రతకు సంబంధించి సున్నితమైన అంశమిది. అగ్నివీర్ సమస్యపై దేశాన్ని తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్పీకర్ అవకాశం ఇచ్చినప్పుడు ఓ ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నా' అని తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన అగ్నివీర్‌లకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం అంశాన్ని రాహుల్ గాంధీ మరోసారి లేవనెత్తారు. అమరుల్కెన అగ్నివీరుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని రక్షణశాఖ మంత్రి చెప్పారని గుర్తుచేశారు. అయితే, ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదని, అది కేవలం ఇన్సూరెన్స్ మాత్రమేనని స్పష్టం చేశారు.

# డిజిటల్ కరెన్సీ పైలట్ టెస్టింగ్

- డిజిటల్ ఎకానమీ 20 శాతానికి చేరుతుంది
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

**ముంబై:** ప్రముఖ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వినియోగదారులకు రిటైల్ చెల్లింపుల అనుభవాన్ని విప్లవాత్మకంగా మార్చిందని ఆర్‌బిఐ పేర్కొంది. ఇది లావాదేవీలను వేగంగా, మరింత సౌకర్యవంతంగా చేసిందని వెల్లడించింది. ఈ క్రమంలో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ పైలట్ టెస్టింగ్‌తో డిజిటల్ కరెన్సీ రంగంలో ముందంజలో ఉంది. ఈ నేపథ్యంలో 2026 నాటికి స్థూల దేశీయోత్పత్తిలో భారత్ డిజిటల్ ఎకానమీ 20 శాతానికి చేరుతుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఇది జీడీపీలో 10 శాతంగా ఉందన్నారు. 2023-24కి సంబంధించిన రిపోర్ట్ ఆన్ మనీ అండ్ ఫైనాన్స్ పరిచయంలో, ఆర్థిక రంగంలో డిజిటలైజేషన్ తదుపరి తరం బ్యాంకింగ్‌కు మార్గం సుగమం చేస్తుందని గవర్నర్ ఉద్ఘాటించారు. ఈ నేపథ్యంలో డిజిటల్ విప్లవంలో భారత్ ముందంజలో ఉందని నివేదిక తెలిపింది. డిజిటల్ చెల్లింపులను వేగవంతం చేయడం ద్వారా దేశం ఆర్థిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే కాకుండా బయోమెట్రిక్ గుర్తింపు, యూన్ని÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్, మొబైల్ కనెక్టివిటీ, డిజిటల్ లాకర్స్, డేటా షేరింగ్ రంగాల్లో దీని ప్రాముఖ్యత పెరిగిందని రిపోర్ట్ చెప్పింది. 2023లో భారతదేశంలో ఇంటర్నెట్ వ్యాప్తి 55 శాతంగా ఉంది. అయితే ఇటీవలి మూడేళ్లలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 199 మిలియన్లు పెరిగింది. భారతదేశంలో ఒక గిగాబైట్ (ఉః) డేటా ధర ప్రపంచంలోనే అతి తక్కువగా సగటున జీబీకి రూ.13.32గా ఉందని తెలిపింది. ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీలు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో (ఔఃఈఅ) లోన్ సర్వీస్ ప్రొవైడర్లుగా సహకరిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలో అందుబాటు ధరల్లో ఆర్థిక సేవలను పొందేందుకు టెక్నాలజీ మరింత మెరుగు పడుతుందని గవర్నర్ అన్నారు.

# విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో అవినీతి

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని చట్టం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా, వినియోగ ప్రాతిపదికన విభజన జరగాలని ఆనాడు జ్కెపాల్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించారన్నారు. రాజ్యాంగంలో లేని ప్రత్యేక మినహాయింపు తెలంగాణకు ఇప్పించారని, 53.46 శాతం తెలంగాణకు, 46.54 శాతం ఏపీకి విద్యుత్ పంపిణీ చేసేలా జ్కెపాల్ రెడ్డి తీవ్రంగా కృషి చేశారని, తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లు కమ్ముకుండా చేశారని కొనియాడారు. నాడు కేసీఆర్ ఎలా సభను తప్పుదోవ పట్టించారో 2015 రికార్డులు తీయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు తాను సభలో మాట్లా డితే సభ నుంచి మార్షల్స్‌తో బయటకు పంపించారన్నారు. సోలార్ ప్రాజెక్ట్ గురించి గొప్పగా చెబుతున్నారు... అవి ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయని, వాళ్ల పాలనలో సోలార్ పవర్ కేవలం ఒక మెగావాట్ మాత్రమేనని అన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సంబంధించి ఎలక్ట్రో మెకానికల్ వర్క్, సివిల్ వర్క్ కాంట్రాక్టు విషయంలో వాళ్ల తెలివి ప్రదర్శించారని, గంపగుత్తగా బీహెచ్‌ఈఎల్‌కు కాంట్రాక్టు అప్పగించారన్నారు. బీహెచ్‌ఈఎల్ నుంచి సివిల్ వర్క్స్ మొత్తం వాళ్ల బినామీలు, బంధువులు, అనుయాయులకు ఇచ్చారని ఆరోపించారు. అందులో వేలకోట్ల అవినీతి జరిగిందని సీఎం విమర్శించారు. విచారణలో అంతా బయటపడుతుందనే ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారన్నారు. 400 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు టెండర్ వేస్తే సూపర్ క్రిటికల్ టెండర్ పిలిస్తే కొరియన్, బీహెచ్‌ఈఎల్, మరో కంపెనీ పాల్గొన్నాయని.. అక్కడ 18 శాతం లెస్‌కు బీహెచ్‌ఈఎల్ పనులు దక్కించుకుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇక్కడ కూడా 18 శాతం లెస్‌కు పనులు చేసే అవకాశం ఉన్నా.. ప్రాజెక్టును నామినేషన్‌పై బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించారన్నారు. అందులో దాదాపు రూ.8వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు విషయంలో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో గుజరాత్‌లోని ఇండియా బుల్స్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారని, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించాలని చట్టంలో ఉన్నా ఉల్లంఘించారని విమర్శించారు. ఇండియా బుల్స్ నుంచి రూ. వెయ్యి కోట్లు మెక్కి కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించారని, భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ కట్టాల్సిన చోట కట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. వాళ్ల నిర్వాకంతో 16 మంది అధికారులు విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పరిస్థితి నెలకొందని, వారి కోరిక మేరకే విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దొరికిపోయామని అర్థమైంది కాబట్టే కమిషన్‌పై ఆరోపణలు చేశారన్నారు. కావాలన్నది వాళ్లేనని.. సెగ తగలగానే వద్దన్నది వాళ్లేనని పేర్కొన్నారు. తిన్నింటి వాసాలు లేక్కబెట్టే లక్షణాలు తమకు లేవని.. వీరి వాదన ఏంటో కమిషన్ ముందు చెప్పాలన్నారు. ఈరోజు సాయంత్రాని కల్లా విచారణ కమిషన్‌కు కొత్త చెైర్మన్‌ను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. విద్యుత్ అంశంలో న్యాయ విచారణ కోరిందే భారాస సభ్యులు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపా రు. 'జగదీశ్‌రెడ్డి ఆవేదన చూస్తుంటే చర్లపల్లి జ్కెలులో ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు, యాదాద్రి పవర్ లాంట్‌పై న్యాయ విచారణ జరుగుతోం ది. విచారణ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తే భారాస సభ్యుల నిజాయతీ బయటకు వస్తుంది. న్యాయ విచారణ కోరింది వాళ్లే.. వద్దంటున్నది వాళ్లే. విద్యుత్ కమిషన్ ఎదుట కేసీఆర్ ఎందుకు హాజరు కాలేదని అన్నారు.



# ఆత్మరక్షణలో పడ్డప్పుడల్లా అబద్దాల ప్రకటనలు

(మొదటిపేజీ తరువాయి)

సభలో అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత సమావేశాల్లో మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం ప్రాజెక్టు సాధ్యం కాదని రిటైర్డ్ ఇంజినీర్లు నివేదిక ఇచ్చినా మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని అబద్ధమాడారని ధ్వజమెత్తారు. రిటైర్డ్ ఇంజినీర్ల వాదన వేరే లాగా ఉంటే సీఎం మరోలా చెప్పి సభను తప్పుదోవ పట్టించారని ఆక్షేపించారు. నిన్నటి సమావేశంలో విద్యుత్ మీటర్లపై కూడా తప్పుడు పత్రంతో సీఎం సభను తప్పుదోవ పట్టించారని అన్నారు. తనకు కావాల్సిన వాక్యం చదివి మిగతా పదాలు వదిలేశారని అన్నారు. ఉదయ్ స్కీం ఒప్పందం చదివి వ్యవసాయ మీటర్లకు ఒప్పుకున్నట్టు భ్రమింపజేశారని ఏకిపారేశారు. పోతిరెడ్డి పాడుపై దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాఝశేఖర్‌రెడ్డి హయాంలో తాము పదవుల కోసం పెదవులు మూసుకున్నామని రేవంత్ తమపై ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. పోతిరెడ్డిపాడుపై జీఓ రాకముందే తాము వైఎస్ కేబినెట్ నుంచి వైదొలిగామని స్పష్టం చేశారు. పదవుల కోసం పెదవులు మూసుకున్నది రేవంత్ రెడ్డి అనే విమర్శించారు. తానేదో తెలంగాణ ఛాంపియన్ అయినట్టు రేవంత్ మాట్లాడుతుంటే అందరూ నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రకటన వెనక్కి పోతే తాము రాజీనామా చేశామని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్ రెడ్డి కనీసం డూప్లికేట్ రాజీనామా కూడా చేయలేదని ఆక్షేపించా రు. రేవంత్ లాంటి వారు రాజీనామా చేయలేదనే ఆనాడు బలిదానాలు జరిగాయని చెప్పారు. ఆనాటి అమరుల లేఖలు చూస్తే బలిదానాలకు కారణం ఎవరో తెలుస్తుందని తెలిపా రు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ తెలంగాణ కోసం పని చేయలేదని విమర్శలు చేశారు. ఎల్ఆర్ఎస్ గురించి రేవంత్ అప్పుడు ఏం మాట్లాడారు ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి , మల్లు భట్టి విక్రమార్క , ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎల్ఆర్ఎస్ ను ఫీజులు లేకుండా చేయాలని ఆనాడు డిమాండ్ చేశారని అన్నారు. ఇప్పుడేం చేస్తున్నారని అన్నీ ద్వంద్వ ప్రమాణాలేనని ఆరోపించారు. జైపాల్ రెడ్డి తెలంగాణకు ఏ పార్టీనైనా ఒప్పించారా అని నిలదీశారు. రుణ మాఫీపై రేవంత్ ది గోబెల్స్ ప్రచారం చేశారని దుయ్యబట్టారు. రూ.31 వేల కోట్లు రుణమాఫీకి అవుతుందని రూ.25 వేల కోట్లే బడ్జెట్‌లో పెట్టారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జిష్ణుదేవ్‌తో సీఎం రేవంత్ భేటీ


## గవర్నర్‌గా రావడంపై అభినందనలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం 9గంటల సమయంలో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఇటీవల తెలంగాణ గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించిన సంగతి తెలిసిందే. నూతన గవర్నర్ వచ్చిన సందర్భంగా రేవంత్ రెడ్డి ఆయన్ను కలిశారు. రాష్ట్ర ప్రజల తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసెంబ్లీ సమావేశాలకు సీఎం వెళ్లారు. ఈ నెల 31న రాజ్ భవన్‌లో జిష్ణుదేవ్ వర్మను గవర్నర్‌గా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. గతంలో జిష్ణుదేవ్ వర్మ త్రిపుర ఉపముఖ్యమంత్రిగా పని చేశారు. ఈయన త్రిపుర రాజకుటుంబానికి చెందిన వ్యక్తి కాగా..1990లో రామజన్మ భూమి ఉద్యమానికి ఆకర్షితులపై బీజేపీలో చేరారు. తెలంగాణ ఇన్‌ఛార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ కావడంతో ఆయన ఇవాళ రిలీవ్ కానున్నారు. ÷రీసనసభ సమావేశాల అనంతరం రాధాకృష్ణన్‌కు వీడ్కోలు పలికేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు రాజ్ భవన్‌కు వెళ్లనున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర పండగ బోనాల సందర్భంగా రాధాకృష్ణన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం మె?త్తం పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని మహంకాళి, ఎల్లమ్మతల్లిని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# చైనాతో సమస్యలను మేమే పరిష్కరించుకుంటాం

- మూడో దేశం ప్రమేయం కోరుకోవడం లేదు
- జపాన్ పర్యటనలో విదేశాంగ మంత్రి జైశంకర్

**టోక్యో :** భారత్-చైనా మధ్య సంబంధాలు మెరుగ్గా లేవని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. అయితే, ఈ సమస్యను తామే పరిష్కరించుకోగల మని, ఇందులో మూడో దేశం ప్రమేయం అక్కర్లేదని వెల్లడించారు. క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల స్థాయి సదస్సు నిమిత్తం జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. టోక్యోలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా చైనాతో సరిహద్దు వివాదం అంశాన్ని ప్రస్తావించారు. అవును మాకు సమస్య ఉంది. ఇది మా దేశాల మధ్య వివాదం. దీన్ని చర్చించుకుని పరిష్కారం కనుగొనడం మా ఇద్దరి బాధ్యత. భారత్, చైనా రెండు పెద్ద దేశాలు. మా మధ్య సంబంధాలు.. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలపై ఏదో ఒక రకంగా ప్రభావం చూపుతాయి. అందువల్ల ఇతర దేశాలు ఈ అంశంపై ఆసక్తి చూపడం సహజమే. అయితే దీని పరిష్కారానికి ఇతర దేశాల వైపు చూడట్లేదు. ఇందులో మూడో దేశం ప్రమేయం అక్కర్లేదని జ్కెశంకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల చ్కెనా విదేశాంగ మంత్రి



వాంగ్ యీతో తన భేటీని జ్కెశంకర్ గుర్తుచేసుకున్నారు. సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు ప్రతిష్టంభన తొలగించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసేందుకు అంగీకారం తెలిపినట్లు చెప్పారు. సరిహద్దుల్లో శాంతి స్థాపన జరిగే వరకు చ్కెనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావని పునరుద్ఘాటించారు.

# కేజ్రీవాల్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్ తీర్పును రిజర్వ్ చేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ:** సీబీఐ దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ పాలసీ కేసులో రెగ్యులర్ బెయిల్ కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు సోమవారం రిజర్వ్ చేసింది. విచారణ సందర్భంగా కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వరాదని సీబీఐ వాదించింది. తమ విచారణ లో కొత్త విషయాలు వెలుగు చూశాయని, వాటిని కొత్త ఛార్జిషీటులో ప్రస్తావించామని, రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం ఉదయం దానిని దాఖలు చేసామని కోర్టుకు విన్నవించింది. తమ విచారణలో కేజ్రీవాల్‌పై మరికొన్ని సాక్ష్యాలు వెలుగు చూశాయని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. కేజ్రీవాల్ సహా ఆరుగురు వ్యక్తుల పేర్లు ఛార్జిషీటులో నమోదు చేసినట్టు అడ్వకేట్ డీపీ సింగ్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఇందులో ఐదుగురిని ఇంకా అరెస్టు చేయలేదని అన్నారు. పి.శరద్ చంద్ర రెడ్డి, దుర్గేష్ పాఠక్, వినోద్ చౌహాన్, ఆశిష్ మాథుర్,అమిత్ అరోరా పేర్లు కొత్త ఛార్జిషీట్‌లో చోటుచేసు కున్నట్టు తెలిపారు. కంప్యూటర్ లో సేవ్ చేసేందుకు ఎక్సైజ్ పాలసీ కాపీని విజయ్ నాయర్ తెచ్చినట్టు మనీష్ సిసోడియా కింద ఉండే ఐఏఎస్ అధికారి సి.అరవింద్ సాక్షమిచ్చా రని, ఆ సమయంలో అరవింద్ కేజ్రీవాల్ కూడా ఉన్నట్టు చెప్పారని, దానిని బట్టి ఈ కేసులో కేజ్రీవాల్ ప్రత్యక్ష ప్రమేయం ఉందనే విషయం తెలుస్తోందని సీబీఐ న్యాయవాది వాదించారు. మంత్రివర్గం నేతగా ఎక్సైజ్ పాలసీపై కేజ్రవాల్ సంతకం చేశారని, కేసులో ప్రధాన సూత్రధారి ఆయనేనని పేర్కొన్నారు. కాగా, సీబీఐ న్యాయవాది వాదనను కేజ్రీవాల్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తోసిపుచ్చుతూ, ఢిల్లీ ముఖ్యమం త్రిపై ఎలాంటి ప్రత్యక్ష సాక్ష్యం లేదన్నారు. విజయ్ నాయర్ ప్రధాన నిందితుడిగా సీబీఐ చెబుతోందని అన్నారు.

# ఆగస్ట్2న పదోన్నతి ఉపాధ్యాయులతో సిఎం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

డీజీపీ జితేందర్, ఆయాశాఖల కార్యదర్శులు శ్రీధర్, బుర్ర వెంకటేశం, హరిచందన, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంత పెద్దసంఖ్యలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఈ పదోన్నతులు పొందిన ఉపాధ్యా యులందరితో సీఎం నేరుగా మాట్లాడేందుకు ఆగస్టు 2న సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎల్బీ స్టేడియంలో దాదాపు రైన్ ప్రూఫ్ టెంట్స్ వేయించాలని సూచించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ఉపాధ్యాయులకు తగు పార్కింగ్ ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో కావాల్సిన మంచినీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను కల్పించాలని సూచించారు.

# లోక్‌సభలో విప్‌గా కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో తమ పార్టీ తరఫున చీఫ్ విప్, విప్‌లను భాజపా నియమించింది. చీఫ్ విప్, 16మంది విప్‌లను నియమించినట్లు భాజపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. చీఫ్ విప్‌గా డా.సంజయ్ జైశ్వాల్‌ను నియమించగా.. విప్‌లుగా



తెలంగాణకు చెందిన చేవె ళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు పలువురిని నియమించింది. విప్‌లుగా నియమితులైన వారిలో భాజపా ఎంపీలు దిలీప్ సైకియా, గోపాల్‌జీ ఠాకూర్, సంతోష్ పాండే, కమల్‌జీత్ షెరావత్, ధావల్ లక్ష్మణ్‌భాయి పటేల్, దేవుసిన్హ్ చౌహాన్, జుగల్ కిశోర్ శర్మ, కోట శ్రీనివాస్ పుజారి, సుధీర్ గుప్తా, స్మిత ఉదయ్ వాఘ్, అనంత నాయక్, దామోదర్ అగర్వాల్, సతీశ్ కుమార్ గౌతమ్, శశాంక్ మణి, ఖగెన్ ముర్ము నియమిస్తున్నట్లు భాజపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయం కార్యదర్శి డా.శివ్ శక్తినాథ్ బక్షి ఓ ప్రకటన విడుదల చేశారు.

# పొలాలకు మీటర్లు పెట్టాలని చెప్పలేదు

- ఇందుకోసం 30వేల కోట్లు వదులుకున్నాం
- విద్యుత్ స్థాపక శక్తిని పెంచిన ఘనత మాదే
- నిజంగానే కేసీఆర్ సత్యహరిశ్చంద్రుడే
- అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమర్థన
- విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టారన్న రాజగోపాల్ రెడ్డి



**ఖైరతాబాద్, ప్రజానావ:** రైతుల పొలాల్లో మీటర్లు పెట్టడానికి కేసీఆర్ ఒప్పుకోలేదని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చే రూ.30 వేల కోట్లను కూడా వదులుకున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్లపై సీఎం ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. మోదీ, కేసీఆర్, ఉదయ్ స్కీమ్ గురించే మాట్లాడుకున్నారని చెప్పారు. 2014కి ముందు మాత్రమే కరెంటు లైన్ల కింద ఇళ్ల నిర్మాణం జరిగింది. భారాస ప్రభుత్వంలో కరెంటు లైన్ల కింద ఇళ్ల నిర్మాణం జరగలేదు. పదేళ్ల భారాస పాలనలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం పెరిగింది. 2014లో రాష్ట్రంలో వ్యక్తిగత విద్యుత్ వినియోగం 1,196 కిలో వాట్లు. 2024లోఇది 2,349 కిలో వాట్లకు చేరింది. మా ప్రభుత్వంలోనే విద్యుత్ వినియోగం పెరిగింది. రూ.90 వేల కోట్లు పెట్టి విద్యుత్ సరఫరాను బలోపేతం చేశాం. వినియోగం ఆధారంగానే విభజన సమయంలో రాష్ట్రానికి విద్యుత్‌ను కేటాయించారు. రూ.24 వేల కోట్ల అప్పుతో విద్యుత్ రంగం మా చేతికి వచ్చింది. అప్పులు చేయకుండా అభివృద్ధి ఎలా చేయాలి ? అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా? అప్పులు చేస్తున్నామని అసెంబ్లీలో కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఏదో కొత్త విషయం చెప్పినట్లు ఇప్పుడు పదేపదే అప్పులు చేశారు అంటున్నారు' అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముమ్మాటికీ సత్యహరిశ్చంద్రుడే అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. రేవంత్‌లా సంచులు మోసే చంద్రుడు కాదు అని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ పద్దులపై చర్చ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సత్యహరిశ్చంద్రులు అయితే ఎందుకు విద్యుత్ జ్యుడిషియల్ కమిషన్‌కు అడ్డు వస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యుత్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దొంగతనం దొరికిపోయింది కాబట్టే రేవంత్ రెడ్డి ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని జగదీశ్ రెడ్డి నిలదీశారు. మా అధినేత కేసీఆర్ హరిశ్చంద్రుడే. రేవంత్ రెడ్డిలా సంచులు మోసే చంద్రుడు కాదు.. చంద్రుడికి సంచులు మోసి జైలుకు పోయింది రేవంత్ రెడ్డినే అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. నేను విద్యుత్ విషయంలో నిజనిజాలు మాట్లాడుతుంటే.. రేవంత్ రెడ్డినే వడివడిగా సభలోకి వచ్చి నాకు అడ్డు తగిలారు. సీఎం సభలో అడుగు పెట్టగానే తప్పుదోవ పట్టింది. కేసీఆర్ కాలు గోటికి మీరు సరిపోతారా..? కేసీఆర్ గురించి మాట్లాడింది రికార్డుల నుంచి తొలగించండి.. సభను హుందాగా నడిపించాలి. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల మీరు ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నట్లు అని జగదీశ్ రెడ్డి అధికార పక్షాన్ని నిలదీశారు. గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. అప్పుల నుంచి విద్యుత్ రంగాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సీఎంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలు సరికాదన్నారు. గత ప్రభుత్వ తప్పులు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. భారాస ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసింది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు అదనపు విద్యుత్‌ను యూపీఏ ప్రభుత్వం కేటాయించింది. జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్ర అవసరాల మేరకు విద్యుత్ కేటాయించారు. కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడాలని కోరుతున్నాం. కేసీఆర్ సభకు ఎందుకు రావట్లేదని అడిగితే.. కేసీఆర్‌తో మాట్లాడే స్థాయి మాది కాదన్నారు. సభకు రానప్పుడు ఆయనకు ప్రతిపక్ష హోదా ఎందుకు? ప్రతిపక్ష నేత హోదా కేసీఆర్ కాకుండా వేరేవారు తీసుకోవచ్చు కదా? విద్యుత్ అవకతవకలపై కమిషన్ వేసి దర్యాప్తు చేస్తున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్ లాభదాయకం కాదని 2018లోనే చెప్పాను. ఈ ప్లాంట్ పూర్తయ్యేందుకు అదనంగా రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టాలి. డబ్బులు పోయినా యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తికాలేదు. రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. అక్కడ కాకుండా యాదాద్రిలో ఎందుకు నిర్మించారు?' అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

# తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో భారీ కుంభకోణం

- జిఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల గుర్తింపు
- మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌పై కేసు




**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో భారీ కుంభకోణం జరిగిందని గుర్తించిన అధికారులు కేసు నమోదు చేసారు. కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపులో అక్రమాలు జరిగాయని గుర్తించిన అధికారులు కేసు నమోదుచేశారు. ఈ కుంభకోణంలో మాజీ సీఎస్ సోమేష్‌కుమార్‌తో పాటు పలువురు కీలక పాత్ర పోషించారని కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో వందకోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు భావిస్తున్నారు. దాదాపు 75 కంపెనీలు ఇందు లో భాగమై ఉన్నట్టు తేల్చారు. సాఫ్ట్‌వేర్ లో మార్పులు చేసి కుంభకోణానికి పాల్పడినట్టు ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. ఇందులో తెలంగాణల బేవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉందని సమాచారం. ఇందతా అప్పట్లో సీఎస్‌గా ఉన్న సోమేష్‌కుమార్ సూచనలతోనే ట్యాక్స్ పేమెంట్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు ఇతర చర్యలు తీసుకున్నారని అధికారులు గుర్తించారు. అందుకే ఈ కేసులో సోమేష్ కుమార్‌తోపాటు ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరామ ప్రసాద్, పిలాంటో టెక్నాలజీస్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమేశ్‌కుమార్‌పై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పన్ను ఎగవేతదార్లకు వీరు సహకరించడం ద్వారా రూ.వేల కోట్ల అక్రమాలు జరిగినట్లు ఆశాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఒక్క తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ పన్ను ఎగవేత ద్వారానే వాణిజ్యపన్నుల శాఖకు రూ.1,000కోట్లకుపైగా నష్టం వాటిల్లగా.. మరో 11 ప్రైవేటు సంస్థలు సుమారు రూ.400కోట్లు ఎగవేసినట్లు ప్రాథమికంగా వెల్లడైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాల మేరకు.. మానవ వనరులను సరఫరా చేసే బిగ్‌లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పన్ను చెల్లించకుండానే రూ.25.51కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకుని మోసానికి పాల్పడినట్లు తేలిన నేపథ్యంలో వాణిజ్యపన్నుల శాఖ అంతర్గతంగా విచారణ జరిపింది. వాణిజ్యపన్నులశాఖకు సాంకేతికతను అందించే సర్వీస్ ప్రొవైడర్‌గా ఐఐటీ హైదరాబాద్ వ్యవహరించింది. తెలంగాణలో పన్ను చెల్లింపుదారులు నమోదు చేసే ఐటీ రిటర్న్‌ల్లో అక్రమాలను గుర్తించడంతోపాటు డేటాను విశ్లేషించడం సర్వీస్‌ప్రొవైడర్ చేయాల్సిన పని. పన్నుచెల్లింపు దారుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సర్వీస్ ప్రొవైడర్ రూపొందించిన 'స్క్రూటినీ మాడ్యూల్' గుర్తించాల్సి ఉంటుంది. కానీ బిగ్‌లీప్ టెక్నాలజీస్ అక్రమాలకు పాల్పడినా ఈ మాడ్యూల్ గుర్తించలేదు. వాణిజ్య పన్నుల శాఖ అంతర్గత విచారణలో తీగ లాగితే డొంక కదిలింది.బిగ్‌లీప్ అక్రమాల నేపథ్యంలో వాణిజ్యపన్నుల శాఖ నియమించిన ఓ అధికారి గతేడాది డిసెంబరు 26న ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో విచారణ జరిపారు. అప్పటి రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రెటరీతోపాటు ఎస్.వి.కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్‌ల మౌఖిక ఆదేశాల మేరకు అక్రమాలను గుర్తించకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. ఐజీఎస్టీలో అక్రమాలను గుర్తించకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసిన కారణంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. అలాగే ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలోని ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ వాణిజ్య పన్నుల శాఖ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు నివేదికలో వెల్లడించారు. ఈ నివేదిక ఆధారంగా కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వాణిజ్యపన్నుల శాఖ వివరణ కోరింది. సోమేశ్‌కుమార్ ఆదేశాలతోనే తాము సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని సూచించినట్లు వారిద్దరు వివరణ ఇచ్చారు. వాణిజ్యపన్నుల శాఖకు సంబంధించి తామెలాంటి సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయలేదని ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ వివరణ ఇచ్చింది. ఈనేపథ్యంలో తమ శాఖకు, ఐఐటీ హైదరాబాద్‌కు జరిగిన ఒప్పందం గురించి మరింత లోతుగా వివరాలు రాబట్టేందుకు జనవరి 25న స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌కు వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారులు లేఖ రాశారు. పలు లోపాలున్నట్లు ఆడిట్ డిపార్ట్‌మెంట్ నివేదిక ఇచ్చింది. డేటా అంతా ఐఐటీ హైదరాబాద్ నియంత్రణలోనే ఉన్నట్లు.. డేటాలో అవసరమైనప్పుడు మార్పులు చేసేందుకు అవకాశముందని వెల్లడించింది. మరోవైపు ఐఐటీ హైదరాబాద్ నిర్వహణలో ఉన్న డేటాబేస్, ఆడిట్ అప్లికేషన్ల గురించి సీడాక్ నుంచి సైతం వాణిజ్యపన్నుల శాఖ నివేదిక తెప్పించింది. ఈనేపథ్యంలో సీడాక్, ఐఐటీ హైదరాబాద్, వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారుల మధ్య జనవరి 30న ఒక సమావేశం జరిగింది. 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరిట ఏర్పాటైన వాట్సప్ గ్రూప్ నుంచి ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ ప్రొ.శోభన్‌బాబుకు తరచూ ఆదేశాలు వచ్చేవని ఆ సమావేశంలో వెల్లడైంది. ఆ గ్రూప్‌లో సోమేశ్‌కుమార్, కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ సభ్యులుగా ఉన్నట్లు తేలింది. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు వెనక ఉద్దేశం గురించి వాణిజ్యపన్నుల శాఖ మరోసారి కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్‌ల నుంచి వివరణ కోరింది. సోమేశ్‌కుమార్ పర్యవేక్షణలోనే ఏర్పాటైన ఆ గ్రూప్‌ను 2022 డిసెంబరులోనే నిలిపివేశామని వారిద్దరు సమాధానమిచ్చారు. అయితే 2024 ఫిబ్రవరి వరకు ఆ వాట్సప్ గ్రూప్‌లో కార్యకలాపాలు నడిచాయని తేలడంతో ఫొటోలు, వీడియోలతో కూడిన చాట్ హిస్టరీని సమర్పించాలని వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు వారిద్దరికి అత్యవసర మెమో జారీ చేశారు. ఐజీఎస్టీ నష్టాలకు సంబంధించిన పలు నివేదికలను వాటిలో గుర్తించారు. అలాగే జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల కేసుల్లోనూ రిజిస్ట్రేషన్లను రద్దు చేయొద్దనే ఆదేశాలున్నట్లు తేలింది.

వారిద్దరి సెల్‌ఫోన్లను ఉన్నతాధికారులు జప్తు చేశారు. వారిద్దరు హైకోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. మరోవైపు ఫోరెన్సిక్ ఆడిట్ సక్రమంగా జరిగేలా చూసేందుకు ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌ను మార్చాలని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌కు వాణిజ్యపన్నుల శాఖ లేఖ రాసింది. అలాగే అప్పటి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎప్పటికప్పుడు ఇచ్చిన సూచనల మేరకే తాము నడుచుకున్నామని పేర్కొంటూ అందుకు సంబంధించిన కొన్ని ప్రతుల్ని వాణిజ్యపన్నుల శాఖకు ఐఐటీ హైదరాబాద్ పంపించింది. ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటీసుల గురించి మాత్రమే ఆ ప్రతుల్లో ఉన్నట్లు తేలింది. కాశీవిశ్వేశ్వరరావు చెప్పినట్లు ఐజీఎస్టీకి సంబంధించి లేకపోవడం గమనార్హం. ఫోరెన్సిక్ ఆడిట్‌కు సంబంధించి సీడాక్ తుదినివేదిక ప్రకారం.. 75 మంది పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన కార్యకలాపాల్ని ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేసినట్లు గుర్తించారు. పన్ను ఎగవేతకు సహకరించేందుకే ఇలా చేసినట్లు తేలింది. చివరకు కాశీవిశ్వేశ్వరరావుపై తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపణలు చేస్తూ వాణిజ్యపన్నుల శాఖకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరగగా అక్రమాలు వెలుగుచూశాయి.

# సింగరేణిపై తీర్మానం చేయండి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్**




**బెల్లంపల్లి, ప్రజానావ:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణి పరిరోణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో దిల్లీలో ధర్నా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తాలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను ప్రారంభించారు. ప్రైవేటీకరణకు మద్దతు ప్రకటించడంలో కాంగ్రెస్, భాజపా, భారాస ఒకటేనని విమర్శించారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకం కానప్పుడు శాసనసభలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు తీర్మానం చేయలేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ దేశానికి చాలా నష్టమని చెప్పారు. 900 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు వున్నాయని, కేవలం 175కోట్ల టన్నుల బొగ్గును వెలికి తీశారని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒకే వేదికపై కూర్చొని వేలం లేదంటూనే ఆ ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని చెప్పారు. ప్రజలంతా ముందుకు వచ్చి సింగరేణిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, చుక్క రాములు, భూపాల్, సంకే రవి పాల్గొన్నారు.


# మదనపల్లె దస్త్రాల ఘటనపై సమగ్ర విచారణ

**కడప, ప్రజానావ:** మదనపల్లె దస్త్రాల ఘటనపై విచారణ సాగుతోందని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించారు. కర్నూలు నుంచి మదనపల్లె వెళ్తూ కొద్దిసేపు ఆయన కడపలో ఆగారు. కడప ఎస్పీ హర్షవర్ధన్‌తో ప్రవీణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ' భారీ స్థాయిలో కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. రెవెన్యూ డాక్యుమెంట్లు పరిశీలించాం. కొన్ని ఆధారాలు లభించాయి. అన్ని అంశాలపై కూలంకషంగా దర్యాప్తు చేస్తున్నాం. సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజపై ప్రధాన ఆరోపణలు వచ్చాయి. ఫోరెన్సిక్ సలహాలు తీసుకోవాలని సీఎం సూచించారు. పెద్దిరెడ్డి పీఏకి చెందిన డాక్యుమెంట్లు దొరికినట్లు తెలుస్తోంది' అని డీఐజీ వెల్లడించారు.

# ఢిల్లీ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ప్రమాదం

- సుప్రీంలో పిటిషన్ వేసిన విద్యార్థులు
- ఘటనపై సిఎం రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ రాజేంద్రనగర్ యూపీఎస్సీ అభ్యర్థుల మృతి కేసు సుప్రీంకోర్టుకు చేరింది. యూపీఎస్సీ అభ్యర్థి అవి నాశ్ దూబే సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ప్రాథమిక హక్కులను కాపాడాలని అభ్యర్థిస్తూ సీజేఐకి దరఖాస్తు చేశారు. మున్సిపాలిటీ ఉదాసీనత కారణంగా ఓల్డ్ రాజేంద్రనగర్, ముఖర్జీనగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోతుందని వెల్లడించారు. ఈ పరిస్థితి ముగ్గురు అభ్యర్థుల మరణానికి కారణమైందని ఆవేదన చెందారు. వర్షం పడితే మోకాళ్ల లోతు నీటిలో నడవాల్సి వస్తోందని వెల్లడించారు. విద్యార్థుల ప్రాణాలకు భద్రత లేదని రాజేంద్రనగర్ ఘటన రుజువు చేసిందని యూపీఎస్సీ అభ్యర్థి అవినాశ్ దూబే ఆవేదన వ్యక్తం చేశారు. గత శనివారం ఢిల్లీలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్ మునిగిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు యూపీఎస్సీ అభ్యర్థులు మృత్యువాతపడ్డారు. శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో.. కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు పోటెత్తింది. ఆ సమయంలో కొందరు విద్యార్థులు ఆ కోచింగ్ సెంటర్‌లోని బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో చదువుకుంటున్నారు. వారంతా చదువులో నిమగ్నమై ఉండగా వరద నీరు చుట్టుముట్టింది. అక్కడ ఉన్నవారిలో కొంతమంది తప్పించుకోగా.. బీహార్‌కు చెందిన తానియా సోని (25), ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయ యాదవ్ (25), కేరళకు చెందిన నెవిన్ డాల్విన్ (28) మృతి చెందారు. విషయం తెలియగానే ఢిల్లీ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని.. వరదలో చిక్కుకున్న విద్యార్థులను బయటికి తీసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదం నేపథ్యంలో కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, సెంటర్ కో-ఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భారత న్యాయ సంహిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అయితే రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్కడ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు వారు



తెలిపారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఐదుగురు నీటిని తోడిపోసే యంత్రాలతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కానీ, లోపలి నుంచి నీరు తోడి బయటకు పోద్దామంటే.. అప్పటికే వాననీటితో రోడ్డు నిండిపోయింది. దీంతో ఆ నీరు పోయేదాకా వేచి ఉండి, ఆ తర్వాత బేస్‌మెంట్‌లోంచి నీటిని బయటకు పంప్ చేశామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌ను వరద నీరు ముంచెత్తిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యవస్థల వైఫల్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. మరోవైపు ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతిపట్ల ఢిల్లీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కాగా... రావూస్ కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు పాత రాజేంద్రనగర్ వద్ద కోచింగ్ సెంటర్లను ఆదివారం పరిశీలించారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించని 13 కోచింగ్ సెంటర్లకు అధికారులు సీల్ వేశారు.

# ఢిల్లీలో అక్రమ కట్టడాలపై బుల్‌డోజర్లు

**న్యూఢిల్లీ:** కాలువలకు అడ్డంగా ఉన్న అక్రమ కట్టడాలపై దిల్లీ ప్రభుత్వం బుల్డోజర్ చర్యలు చేపట్టింది. దేశ రాజధానిలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లో వరద నీరు పోటెత్తడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో డ్రైనేజీలను, కాలువలను ఆక్రమిస్తూ, వాటికి అడ్డంగా నిర్మించిన కట్టడాలను, పాత్‌వేలను బుల్డోజర్‌తో కూల్చివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల వరద నీరు డ్రైనేజీలోకి వెళ్లకుండా రహదారులపై నిలుస్తుందని తెలిపారు. భారీగా వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రమాదాలను నివారించడానికి ఈ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ బుల్డోజర్ చర్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుండడంతో నెటిజన్లు మున్సిపల్ అధికారులను విమర్శిస్తున్నారు. 'ఈ పనులేవో ముందే చేస్తే విద్యార్థుల ప్రాణాలు పోయేవి కావు కదా.. ఏమైనా జరిగితేనే మీ కళ్లు తెరుచుకుంటాయా?' అంటూ ఓ నెటిజన్ ప్రశ్నించారు. మరో నెటిజన్ స్పందిస్తూ.. 'డ్రైనేజీ సమస్యలపై ఇంత ఆలస్యంగా చర్యలు తీసుకుంటారా?.. ఇవన్నీ ఏదో పేరు కోసం చేస్తున్న చర్యలు.. కొద్ది రోజులు పోతే మళ్లీ సమస్యలు పునరావృతం అవుతాయి' అంటూ విమర్శించారు. శనివారం సాయంత్రం రావూస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవహించడంతో ముగ్గురు విద్యార్థులు తాన్యా సోని, శ్రేయా యాదవ్, నవిన్ డెల్విన్ ప్రాణాలు కోల్పోయారు.

# నేడు రెండో విడత రుణమాఫీ

- మాఫీ కానున్న రూ.1.50 లక్షలు
- రైతులు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలి
- సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సిరిసిల్ల, ప్రజానావ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ రెండవ విడుత నిధులను ప్రభుత్వం మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధుల, రైతుల, అధికారుల సమక్షంలో రెండో విడుత రుణమాఫీ రూ. 1.50 లక్షల కార్యక్రమం నిర్వహిం ఓచనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రైతులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు వ్యవసాయ శాఖ సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రుణమాఫీ లబ్ధిదారులైన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.




# అనుమతుల్లేకుండా డీజేలు నడిపించొద్దు

- అత్యవసరమైతే ముందస్తు అనుమతి తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
- డీజే నిర్వాహకులకు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్

**వేములవాడ, ప్రజానావ:** రానున్న గణేశ్ ఉత్సవాలతో పాటు ఇతర పండగల సందర్భంగా విచ్చలవిడిగా డీజేలు పెట్టి, ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని డీజే నిర్వాహకులను వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అదేశాల మేరకు సోమవారం పట్టణానికి చెందిన డీజే నిర్వాహకులతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శబ్ద కాలుష్య విషయంలో ప్రభుత్వం చాలా ఆగ్రహంగా ఉందని, విపరీతంగా ధ్వనులు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలనే ప్రభుత్వ సూచనలతో వేములవాడ పట్టణ పరిధిలో డీజే బాక్సుల వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా అత్యవసర సమయాల్లో డీజేలు వాడాల్సిన పరిస్థితి ఉంటే పోలీసు శాఖ ముందస్తు అనుమతులు తీసుకొని, తక్కువ శబ్దం కలిగించే విధంగా బాక్సులు ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. పోలీస్ శాఖ ఆదేశాలను కాదని ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వాడితే అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

- 105 గ్రాముల గంజాయి, రెండు మొబైల్స్ స్వాధీనం
- ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ శ్రీకాంత్ తో కలసి వివరలు వెల్లడించిన రూరల్ సిఐ మొగిలి

**సిరిసిల్ల/ఇల్లంతకుంట, ప్రజానావ:** గంజాయిలో కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన గుంటి శివకుమార్ అనే వ్యక్తి పొత్తూరు గ్రామంలో బేకరీ నిర్వహిస్తూన్నాడు. శివ కుమార్‌కు గంజాయి సిగరేట్ తాగే అలవాటు ఉంది. బేకరిలో సామగ్రికి గన్నేరువరం వెళ్లినప్పుడు అక్కడ బుర్ర ప్రణయ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలసి కరీంనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుక్కొని వచ్చి వాటిని గంజాయి సిగరేట్లుగా తయారుచేసి తాగేవారు. శివ కుమార్‌కి బేకరీ ద్వారా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపడక గంజాయి తీసుకొచ్చి, అలవాటు ఉన్న వారికి ఎక్కువ ధరకు అమ్మాలని ప్రణయ్‌కి చెప్పాడు. వీరిద్దరూ కలిసి సోమవారం ఉదయం ఇల్లంతకుంట మండలం వంతడ్పుల రోడ్డు బతుకమ్మ తెప్ప వద్ద గంజాయిని అమ్మేందుకు వచ్చారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని, 105 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. గంజాయి తాగే వారిని పట్టుకునేందుకు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకి గంజాయి టెస్ట్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తరహా గంజాయి టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు.



## కోతుల ఆకలి తీర్చేందుకు

# పండ్ల మొక్కల పెంపకం

**జగిత్యాల, ప్రజానావ:** ఆకలితో అలమటిస్తున్న కోతుల ఆకలి తీర్చడం కోసం, శాశ్వత పరిష్కారం చూపించాలనే సదుద్దేశ్యంతో జగిత్యాల జిల్లా అటవీ శాఖ, నేచర్ లవర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా కొండగట్టు అటవీ ప్రాంతంలో సోమవారం పండ్ల మొక్కల పెంపకం కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా అటవీశాఖ అధికారి బి. వెంకటేశ్వర్ మొదటి మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ కోతుల ఆకలి తీర్చటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది ఎంతో తోడ్పడుతుందన్నారు. ఇంత గొప్ప ఆలోచనను ఆచరణలో చూపిస్తున్న నేచర్ లవర్ ఫౌండేషన్‌ను అభినందిస్తూ, నేచర్ లవర్ ఫౌండేషన్‌కు అందరూ సహకరించాలని సూచించారు. అనంతరం నేచర్ లవర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శేఖర్ వంకాయల మాట్లాడుతూ పండ్ల మొక్కలు నాటి, వాటిని సంరక్షించే ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తామని, దీంతో కోతులు మానవులపై ఆధారపడే అవసరం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీఎఫ్ఓ బి. వెంకటేశ్వర్, కొడిమ్యాల ఎఫ్ఆర్ఓ లత, కొండగట్టు డీఆర్వో మోనిక, ముత్యంపేట ఎఫ్‌బీఓ ఎం. సాయిరాం ఇతర అటవీ శాఖ సిబ్బందితో పాటు నేచర్ లవర్ ఫౌండేషన్ ట్రస్టీ బొద్దుల శ్రవణ్ కుమార్, సభ్యులు నర్సింగోజు రాంకిషన్, మారగొండ మల్లేశం, మీనాక్షీ, ఏదుల తిరుపతి, అనిల్ కుమార్, రాజశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ల రికవరీలో

# సిరిసిల్ల నెం.1

- జిల్లాలో 84శాతం రికవరీ
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**సిరిసిల్ల, ప్రజానావ:** ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే సిరిసిల్ల జిల్లా మొదటిస్థానంలో నిలిచిందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పడిపోయిన, దొంగలించబడిన 78 ఫోన్లను రికవరీ చేసి సోమవారం ఆయన చేతులమీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోతే ఆందోళన పడొద్దని, వెంటనే సీఈఐఆర్ లాగిన్ చేసి వివరాలు నమోదు చేస్తే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టవచ్చన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 1200 ఫోన్లు గుర్తించి 1019 (సుమారుగా వీటి విలువ కోటి రూపాయలు) ఫోన్లు బాధితులకు అందించామని, దీంతో 84శాతం ఫోన్ల రికవరీతో రాష్టంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానంలో జిల్లా నిలిచిందన్నారు.

### సీఈఐఆర్‌లో ఇలా నమోదు చేసుకోవాలి

కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా సెల్ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెతికి పట్టుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. సెల్ఫోన్ పోయిన వ్యక్తి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ముందుగా ఫిర్యాదు చేయాలి. లేదంటే మీసేవ కేంద్రానికి వెళ్లి www.ceir.gov.in అనే వెబ్‌సైట్‌లో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/ స్టోలెన్ అనే లింకై క్లిక్ చేసి, సెల్‌ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నెంబర్, కంపెనీ పేరు, మోడల్, కొన్న బిల్లు అప్‌లోడ్ చేయాలి. దీంతో పాటు ఏరోజు, ఎక్కడ పోయింది. రాష్ట్రం, జిల్లా, పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసిన వివరాలు నమోదు చేయాలి. చివరిగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు, ఈమెయిల్ ఐడీ, ఓటీపీ కోసం మరో సెల్‌ఫోన్ నెంబర్ ఇవ్వాలి. ఇదంతా పూర్తయిన తరువాత ఒక ఐడీ నెంబర్ వస్తుంది. తద్వారా సంబంధిత ఐడీ ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చన్నారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్ 84శాతం రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషిచేసిన ఐటీ కోర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజా తిరుమలేశ్‌లను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

# ఎల్ఓసీ అందజేత

**వేములవాడ, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన మధు శ్రీ అనారోగ్య సమస్యతో నిమ్స్‌లో చేరింది. అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విషయం చెప్పగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బందితో చర్చలు జరిపారు. ప్రత్యేకమైన చికిత్స అందించాలని ఆదేశిస్తూ, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయంగా వైద్య ఖర్చులకు వెంటనే రూ. 1.50లక్షలు మంజూరు చేయించారు. అత్యవసర ఆరోగ్య చికిత్స నిమిత్తం ఎల్ఓసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్‌కు మధుశ్రీ కుటుంబసభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## అమెరికాలో హైదరాబాద్

# యువకుడు మృతి

**చికాగో:** హైదరాబాద్ కాటేదాన్‌కు చెందిన అక్షిత్ రెడ్డి(26) అనే యువకుడు అమెరికాలోని చికాగోలో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం అక్షిత్ మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. ఎంఎస్ పూర్తిచేసి అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఈ నెల 21న స్నేహితులతో కలిసి చికాగోలోని లేక్‌మిశిగన్‌లో ఈతకు వెళ్లగా, ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. పోలీసులు గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని స్వదేశానికి పంపించగా, అంత్యక్రియలు పూర్తి చేశారు.

# విదేశాల్లో 633 మంది భారతీయ విద్యార్థులు మృతి

## కెనడా, అమెరికాలో అత్యధిక మరణాలు

**న్యూఢిల్లీ:** గత ఐదేళ్లలో విదేశాల్లో చదువు తున్న భారతీయ విద్యార్థుల్లో 633 మంది మరణించారు. కెనడా, అమెరికాలో మరణాల సంఖ్య అత్యధికంగా నమోదయ్యాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. కేరళ ఎంపీ కొడికున్నిల్ సురేష్ సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సమా ధానమిచ్చారు. ప్రమాదాలు, వైద్య పరిస్థితులు, దాడులు వంటి కారణాల వల్ల 2019 నుంచి 41 దేశాల్లో 633 మంది భారతీయ విద్యార్థులు చనిపోయినట్లు చెప్పారు. కాగా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం కెనడాలో అత్యధికంగా 172 మంది భారతీయ విద్యార్థుల మరణించారు. ఆ తర్వాత 108 మరణా లతో అమెరికా రెండో స్థానంలో ఉంది. బ్రిటన్‌లో 58, ఆస్ట్రేలియాలో 57, రష్యాలో 37, జర్మనీలో 24, పాకిస్థాన్‌లో ఒక భారతీయ విద్యార్థి మరణాలు నమోదయ్యాయి. మరోవైపు విదేశాల్లో జరిగిన దాడుల్లో 19 మంది భారతీయ విద్యార్థులు మరణించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. కెనడాలో జరిగిన దాడుల్లో అత్యధికంగా 9 మంది, అమెరికాలో ఆరుగురు మరణించా రు. ఆస్ట్రేలియా, చైనా, బ్రిటన్, కిర్గిజ్‌స్థాన్‌లో జరిగి న దాడుల్లో ఒక్కరు చొప్పున ఇండియన్ స్టూడెంట్స్ చనిపోయారు. గత మూడేళ్లలో 48 మంది భారతీయ విద్యార్థులను అమెరికా నుంచి బహిష్కరించినట్లు తెలిపారు.



# ముసురుతో జర జాగ్రత్త



## వరద నీటితో వ్యాధుల ముప్పు.. పరిశుభ్రతే ప్రధాన ఆయుధం
## గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**వర్షకాలంలో గ్రామాల్లో కురుస్తున్న వర్షాలు వ్యాధులను వెంట తీసుకొచ్చే ప్రమాదం ఉంది. పరిసరాల్లో నీటినిల్వ పెరిగిదోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వైద్యాధికారులు సూచిస్తున్నారు.**

**- నేరడిగొండ, ప్రజానావ**

### రోగాల వ్యాప్తికి అనుకూలం..

వర్షాల కారణంగా ఇళ్లలో నీటి వినియోగమూ తక్కువే. పరిసరాల్లో డబ్బాలో నిలిచిన నీటితో దోమలు వ్యాప్తి చెంది. లార్వా వృద్ధి చెందుతుంది. ఈ దోమలు ఇళ్లలోని అల్మారాలు, ఫర్నిచర్ వెనుక నక్కిఉంటాయి. శిథిల భవనాలు, ఖాళీగా ఉన్న ఆవాసాల్లో శుభ్రత లోపించి దోమలు వృద్ధి చెందేందుకు అస్కారముంటుంది. వాతావరణం అనుకూలించగానే మలేరియా, డెంగీ, చికెన్గున్యా వంటి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతాయి. పైపు లైన్ లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ కుండా చూసుకోవాలి. కూలర్లు, డ్రమ్ములోని నీటిని పారబోయాలి. పాత్రలపై మూతలు పెట్టి ఉంచాలి.
- ఇంట్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశు భ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- చల్లదనం పెరిగిన నేపథ్యంలో ఊపిరితిత్తుల సమస్యలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెచ్చదనం ఉండేలా చూడాలి.
- కాచి చలార్చిన నీటితోపాటు, వేడి పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి.
- మాంసాహారం తగ్గించడంతోపాటు బయటి ఫుడ్ దూరంగా ఉండాలి.






### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాలతో వ్యాధులు వ్యాప్తి చెందడానికి అస్కారం ఉంటుంది. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు. అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యుడ్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాల బారిన పడకుండా ఉంటాం.

- ఎండి సద్దాం, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నేరడిగొండ





# ‘సప్త సాగరాలు’ బ్యూటీతో రొమాన్స్ చేయనున్న విజయ్ దేవరకొండ?

టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. లైగర్ వంటి భారీ డిజాస్టార్ తర్వాత ఖుషి, ఫ్యామిలీ స్టార్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాగా ఈ సినిమాలు కూడా బాక్సాఫీస్ ముందు ఫ్లాప్‌గా నిలిచాయి. ఇక ప్రస్తుతం విజయ్ గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ప్రస్తుతం శ్రీలంకలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే మరో ప్రాజెక్ట్‌ను విజయ్ పట్టాలెక్కించబోతున్నాడు. ‘రాజా వారు రాణి గారు’ ఫేమ్ రవికిరణ్ కోలాతో విజయ్ ఒక సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ రోల్‌కు సంబంధించి ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో కథానాయికగా సప్త సాగరాలు బ్యూటీ రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదట ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయి పల్లవిని అనుకున్నారు మేకర్స్. కానీ అనుకోకుండా ఆ ప్లేస్ లో ఇప్పుడు రుక్మిణి వచ్చింది. అయితే ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.



# అనుపమ అందాల ఆరబోత!

మలయాళంలో వచ్చిన ప్రేమమ్ తో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది క్రేజీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. అఆ తో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది అనుపమ.తొలి తోనే తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది అనుపమ పరమేశ్వరన్. ఆతర్వాత వరుస లతో దూసుకుపొయింది ఈ చిన్నది. బ్యాక్ టు బ్యాక్ యంగ్ హీరోల ల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ చేసింది. మలయాళంలో వచ్చిన ప్రేమమ్ తో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది క్రేజీ బ్యూటీ అనుపమపరమేశ్వరన్. అఆ తో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది అనుపమ. తొలి తోనే తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది అనుపమ పరమేశ్వరన్. ఆతర్వాత వరుస లతో దూసుకుపొయింది ఈ చిన్నది. బ్యాక్ టు బ్యాక్ యంగ్ హీరోల ల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ లు చేసింది. ప్రస్తుతం యంగ్ హీరోల హాట్ ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. ఇప్పుడు ఈ చిన్నది బ్యాక్ టు బ్యాక్ లతో బిజీగా గడిపేస్తోంది. రీసెంట్ గా గ్లామర్ గేట్లు ఎత్తేసింది అనుపమ పరమేశ్వరన్. సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులకు మంచి కిక్ ఇస్తున్నాయి. అమ్మడి ఫోటోలకు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఉంది. అనుపమ షేర్ చేసే ఫోటోలకు సోషల్ మీడియాలో నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అయితే కొంతమంది మాత్రం హద్దు దాటి కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా అనుపమ పరమేశ్వరన్ కొన్ని ఫోటోలను షేర్ చేసింది.



# తాప్సీ వయ్యారాల పరువం..

ఝుమ్మంది నాదం తో తెలుగు తెరకు పరిచయమైన తాప్సీ.. ఆ తర్వాత ఎన్నో ల్లో నటించింది. ప్రస్తుతం హిందీలో వరుస లు చేస్తూ బిజీగా ఉంటుంది. ఇటీవలే తన ప్రియుడు డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియస్ బోతో ఏడడుగులు వేసింది. పదేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరు కొన్ని నెలల క్రితం ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితుల సమక్షంలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు.ఝుమ్మంది నాదం తో తెలుగు తెరకు పరిచయమైన తాప్సీ.. ఆ తర్వాత ఎన్నో ల్లో నటించింది. ప్రస్తుతం హిందీలో వరుస లు చేస్తూ బిజీగా ఉంటుంది. ఇటీవలే తన ప్రియుడు డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియస్ బోతో ఏడడుగులు వేసింది. పదేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరు కొన్ని నెలల క్రితం ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితుల సమక్షంలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఈబ్యూటీ పెళ్లికి సంబంధించిన వీడియోస్, ఫోటోస్ సోషల్ మీడియాలో లీక్ అయ్యాయి. ఇదిలా ఉంటే.. పెళ్లి తర్వాత ల్లో నటిస్తూనే తిరిగి బిజీ అయ్యింది. ఇంటర్వ్యూలలో కూడా తాప్సి బోల్డ్‌గా మాట్లాడడం చూస్తూనే ఉన్నాం. నటనకు ప్రాధాన్యత ఉన్న రోల్స్ నేచుకుంటూనే.. వీలు చిక్కినప్పుడల్లా గ్లామర్ తో అదరగొడుతోంది ఈ చిన్నది. తాప్సీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అంబానీ ఇంట పెళ్లికి హాజరుకాకపోవడంపై స్పందిస్తూ.. నిజం చెప్పాలంటే వాళ్లు నాకు వ్యక్తిగతంగా తెలియదు. పెళ్లి అనేది ఎన్నో అనుబంధాలతో కూడుకున్నది. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య కనీసం ఏదో ఒకరకమైన అనుబంధం ఉండాలని నేను భావిస్తాను, అలాంటి వివాహాలకు మాత్రమే హాజరవుతాను అని తాప్సీ చెప్పారు. ఇక ల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆమె మూడు ల్లో పనిచేస్తూ ఫుల్ బిజీగా ఉన్నారు.

# 31న గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

## త్రిపుర రాజవంశానికి చెందిన వ్యక్తి వర్మ



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ నియమితులైనందున ఆయన ఈ నెల 31న రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. తమిళిసై సౌందరరాజన్ స్థానంలో జార్ఖండగ్ గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణను ఇన్‌చార్జి గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించిన విషయం తెలిసిందే. ఆయన సోమవారం రిలీవ్ అవుతున్నారు. రాధాకృష్ణ మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. రాధాకృష్ణన్ సహా మొత్తం 9 రాష్ట్రాలకు రాష్ట్రపతి గవర్నర్లను నియమించారు. ఇక రాధాకృష్ణ స్థానంలో జిష్ణుదేవ్ వర్మ తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చెప్పట్టనున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాజ్ భవన్ కు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు పలువురు మంత్రులు వెళ్లి రాధాకృష్ణన్ కు వీడ్కోలు పలికారు. కాగా.. బోనాల సందర్భంగా ప్రజలకు రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. మహంకాళి ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, పంటలతో రాష్ట్రం సస్య శ్యామలం కావాల ని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఇక ఈ నెల 31వతేదీ సాయంత్రం 5 గంటలకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. జిష్ణుదేవ్‌వర్మ 1957 ఆగస్టు 15న జన్మించారు. త్రిపుర రాష్ట్ర పూర్వపు రాజవంశానికి చెందిన జిష్ణు దేవ్ వర్మ.. రామజన్మభూమి ఉద్యమ సమయంలో 1990లో బీజేపీలో చేరారు. ఆయన గతంలో 2018 నుంచి 2023 వరకూ త్రిపురలో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలలో జిష్ణు దేవ్ వర్మ సెపాహిజాలా జిల్లాలోని చరిలం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. జిష్ణు దేవ్ వర్మ రచయిత కూడా కావడం విశేషం. ఆయన ఇటీవల తన జ్ఞాపకాల పేరుతో పుస్తకం విడుదల చేశారు. అంతే కాకుండా జిష్ణు దేవ్ వర్మ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కూడా కావడం గమనార్హం. ఆయన సతీమణి పేరు సుధా దేవ్ వర్మ. కేంద్ర ప్రభుత్వం 10 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించింది. ఏడుగురిని కొత్తగా నియమించగా.. ముగ్గురిని ఓ చోటి నుంచి మరో చోటుకు బదిలీ చేసింది. త్రిపుర మాజీ డిప్యూటీ సీఎం జిష్ణుదేవ్ శర్మ (66) తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులయ్యారు. రాజ కుటుంబానికి చెందిన జిష్ణుదేవ్ వర్మ 1957, ఆగస్ట్ 15న జన్మించారు. 1990ల ప్రారంభంలో బీజేపీలో చేరారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 2018 - 23 మధ్య త్రిపుర రెండో ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. అయోధ్య రామ జన్మభూమి ఉద్యమంలో పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ సేవలందించారు. ఝార్ఖండ్ గవర్నర్‌గా పని చేస్తూ తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తోన్న సీపీ రాధాకృష్ణన్‌ను కేంద్రం మహారాష్ట్రకు బదిలీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ గవర్నర్‌గా ఉన్న రమేష్ బైస్‌ను తప్పించింది. ఃరాజస్థాన్ బీజేపీ సీనియర్ నేత ఓం ప్రకాశ్ మాథుర్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించింది. ప్రస్తుతం ఇక్కడ గవర్నర్‌గా ఉన్న లక్షణ్ ప్రసాద్ ఆచార్య అస్సాం గవర్నర్‌గా బదిలీ అయ్యారు. ఆయనకు మణిపూర్ గవర్నర్‌గా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ప్రస్తుతం మణిపూర్ గవర్నర్‌గా ఉన్న అనసూయ ఉయికేను తప్పించింది. అలాగే, రాజస్థాన్ గవర్నర్‌గా మహారాష్ట్ర మాజీ స్పీకర్ హరిభావ్ కిషన్ రావ్ బాగ్డే నియమితులయ్యారు. ఇక్కడ గవర్నర్‌గా ఉన్న సీనియర్ నేత కల్‌రాజ్ మిశ్రాను తప్పించారు. యూపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ఝార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఈయన బరేలీ నుంచి వరుసగా 1989 నుంచి వరుసగా 2019 వరకూ (2009-2014 వరకూ మినహాయించి) గెలుపొందుతూ వచ్చారు. తెలంగాణ బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డిని త్రిపుర గవర్నర్‌గా నియమించింది. ఛత్తీస్‌గఢ్ ప్రస్తుత గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పదవీ కాలం పూర్తి కాగా.. అస్సాం మాజీ ఎంపీ రమెన్ డేకాను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమించింది. కర్ణాటక మాజీ మంత్రి సీహెచ్ విజయశంకర్ మేఘాలయ గవర్నర్‌గా నియమించింది. ఇక్కడ గవర్నర్‌గా ఉన్న ఫగు చౌహాన్‌ను తప్పించింది. అస్సాం గవర్నర్‌గా గులాబ్ చంద్ కటారియను పంజాబ్ గవర్నర్‌గా, కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది. కాగా, ఇప్పటివరకూ ఈ బాధ్యతలు నిర్వహించిన పంజాబ్ గవర్నర్ బన్వారీలాల్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కె.కైలాసనాథన్ నియమితులయ్యారు. ఈయన 1979వ బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రధాని మోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన సీఎంలకూ ఆయన ప్రధాన ముఖ్య కార్యదర్శిగానూ వ్యవహరించారు. మొత్తం 11 సార్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈయన పదవీ కాలాన్ని పొడిగించగా.. ఈ ఏడాది జూన్ 30తో పదవీ కాలం పూర్తైంది. తాజాగా, ఆయన్ను పుదుచ్చేరి గవర్నర్‌గా నియమించింది.

# షిరిడికి భారీగా ఆదాయం



**షిరిడి:** మహారాష్ట్రలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో గురు పూర్ణిమ వేడుకలు ఇటీవల భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారీగా ఆదాయం సమకూరింది. గురుపూర్ణిమకు ఎక్కడెక్కడి నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటారు. సాయిబాబాను సుమారు 4లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారని షిర్డీ సాయిబాబా సంస్థాన్ సీఈఓ గోరక్ష్ గాడిల్కర్ వెల్లడించారు. భక్తుల నుంచి సాయి బాబా ఆలయానికి దాదాపు రూ. 6.25 కోట్ల విరాళాలు వచ్చాయన్నారు. వీటిలో రూ.1.20 కోట్ల డొనేషన్లను సాయి మందిరంలోని కౌంట ర్‌లో, రూ.2.53కోట్ల డొనేషన్లను హుండీ ద్వారా సాయి భక్తులు అందించారని ఆయన తెలిపారు. మరో రూ.1.95కోట్లను ఆన్‌లైన్, చెక్కులు, డీడీ ద్వారా భక్తులు సాయిబాబా ఆలయానికి ఇచ్చారని గోరక్ష్ గాడిల్కర్ చెప్పారు. రూ.8 లక్షలు విలువైన బంగారం, రూ.2.70 లక్షలు విలువైన 5 కేజీల వెండిని కూడా భక్తులు సాయిబాబా ఆలయానికి విరాళంగా అందించారన్నారు. మూడు రోజుల వ్యవధిలో 205 మంది భక్తులు రక్తదానం చేశారని ఆయన వివరించారు.

# బీఆర్ఎస్ఎల్పీ విలీనం లేనట్లేనా?

- మళ్లీ సైలెంట్ అయిన చేరికల వ్యవహారం
- స్థానిక ఎన్నికలతో గ్రామాలపై ఫోకస్



**ఖైరతాబాద్, ప్రజానావ:** కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం జరుగుతుందన్న ప్రచారం వెనక్కి పోయిందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. లేకపోతే ఎమ్మెల్యే చేరిక ఆగిపోయిందా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపణలు చేసినట్లుగా జరగడం లేదు. ఈ విసయంలో బిఆర్ఎస్ తీసుకున్న జాగ్రత్త చర్యలు ఫలించాయా అన్న ప్రచారం కూడా సాగుతోంది. అలాకానీ పక్షంలో ఇప్పుడు చేరిన ఎమ్మెల్యేల విషయంలో ఎలాంటి చర్యలు ఉండబోతాయన్నది కూడా ముఖ్యమే. భారత రాష్ట్ర సమితి ఎల్పీని విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు చాలా తీవ్రంగా ప్రయత్నించారు. అయితే వారి ప్రయత్నం సఫలం కాలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది రేవంత్‌తో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నారు కానీ.. పార్టీలో చేరే విషయంలో మాత్రం ఏ విషయం చెప్పడం లేదు. రేవంత్ సీఎం కాబట్టి ఆయనను ధిక్కరించలేరు.. అలాగని పార్టీలో చేరిపోతామని కూడా చెప్పడం లేదు. అనివార్య పరిస్థితుల్లో కొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అలాంటి వారు పది మంది ఉన్నారు. మరో పదిహేను మందిని అయినా చేర్చుకుంటే తప్ప.. ఎల్పీ విలీనం కాదు. ఆ పదిహేను మంది ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నా రు. వారెవరో మాత్రం.. క్లారిటీగా లేదు. అయితే కాంగ్రె స్ మైండ్ గేమ్ ఆడిందని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. విలీనమయ్యే స్థాయిలో కాంగ్రెస్‌లలో చేరే పరిస్థితి లేదని క్లారిటీ వచ్చేసినట్లయింది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఒకరొకరుగా పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరారు. పదకొండో ఎమ్మెల్యే కూడా చేరబోతున్నారని ఓ సారి హడావుడి చేశారు. ఇంకా చెప్పాలంటే అసెంబ్లీ ఎన్నిక ల్లోపు బీఆర్ఎస్ఎల్పీ విలీనం అవుతుందని ఆ పార్టీలో ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలు కూడా ఉండరని కోమ టిరెడ్డి వెంకటరెడ్డి వంటి వరకూ గంభీరమైన ప్రకటనలు చేశారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభ మయ్యాయి.. ముగిశాయి.. ప్రతిపక్ష నేత హోదాలో ఓ సారి కేసీఆర్ సభకు వచ్చి వెళ్లారు. కానీ మరో ఎమ్మెల్యే చేరిక మాత్రం జరగలేదు. వచ్చే కొద్ది నెలల్లో తెలంగాణ రాజకీయాలు మారిపోతాయని ఓపిక పట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ పెద్దలు సర్ది చెబుతున్నారు. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీతో జరుగుతున్న చర్చల గురించి బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నట్లుగా తెలుస్తోంది. కొద్ది నెలల్లో ప్రభుత్వాన్ని మార్చేద్దామన్న నమ్మకం కలిగేలా పార్టీ ఎమ్మెల్యేలకు బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం లేదా పొత్తుల గురించి ఎంతగా ప్రచారం జరిగుతున్నా మౌనం అర్ధాంగీకారం అన్నట్లుగా రెండు పార్టీల నేతలు మౌనంగా ఉంటున్నారు. అసలు అలాంటి దేమీ లేకపోతే మరోమాట లేకుండా ఖండించేవారు. అలాంటి ఖండన ప్రకటనలు రాకపోవడంతో నిజంగానే చర్చలు జరుగుతున్నాయన్న నమ్మకంతో ఎమ్మెల్యేలు ఉన్నారు. రేపు కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత.. ఇలాంటి పరిస్థితి వస్తే.. ఇబ్బంది పడతామని జరిగే పరిణామాల ను బట్టి వేచి చూడాలని అనుకుంటున్నారు. ఈ కారణం గా చేరికలు కాంగ్రెస్ అనుకున్నంత జోరుగా సాగలేదు. మరో వైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఐదు నుంచి పది కోట్లకు కొంటున్నామని అంత కంటే ఎక్కువ ఖరీదు పెట్టడం లేదని .. చేసినట్లు గా చెబుతున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీని నమ్మి తాము పార్టీలో చేరితే.. తామేదో డబ్బులకు అమ్ముడుపోయామన్నట్లుగా ప్రచారం చేయడం ఏమిటని వారు అసంతృప్తికి గురవుతున్నట్లుగా చెబుతు న్నారు. రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో చేశారో కానీ.. వచ్చిన ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరి అమ్ముడుపోయా మన్న పేరు తెచ్చుకోవడం ఎందుకని సైలెంట్ అయి పోయే పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్ రాజకీయాలు ఎప్పటికప్పుడు భిన్నంగా ఉంటాయి. అలాంటి పార్టీలో చేరాలంటే ఒకటికి పది సార్లు ఆలోచించే పరిస్థితిని కల్పిస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పుడు స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టాల్సి ఉంది. ఈ క్రమంలో చేరికలు వెనక్కి పోయాయని కూడా అంటున్నారు.



# నేటి నుంచి లక్షన్నర రుణాల జమ

- ఆగస్టు 15 లోగా 2లక్షల మాఫీ
- ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ
- సీఎం రేవంత్ ప్రకటనతో పక్కాగా కార్యాచరణ

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఆగస్టులో రుణమాఫీ పక్రియ పూర్తి చేసి మాట నిలబెట్టుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు కార్యాచరణ సాగుతోంది. రూ.1.50 లక్షల్లోపు పంటరుణం ఉన్న ప్రతి రైతుకు రెండో విడతగా జులై 31 కంటే ముందే మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.6,093 కోట్లు జమ చేశాం. వచ్చే నెల 2 నుంచి 14వ తేదీ వర కు విదేశీ పర్యటనకు వెళ్తున్నాను. తిరిగివచ్చిన వెంటనే రూ.2 లక్షల్లోపు ఉన్న రైతుల రుణాల మొత్తాన్ని మాఫీ చేస్తాం. రైతుల రుణం తీర్చుకుని వారికి కృతజ్ఞత తెలియ జేస్తాం అని ప్రకటించారు. దీంతో ఈ నెలాఖరుకు లక్షన్నర లోపు రుణాలు మాఫీ కానున్నాయి. తెలంగాణ రైతులు ఎంతగానో ఎదురు చూసిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించింది. మొదటి విడతగా లక్ష మేరకు రుణాలు మాఫీ చేయాలని సర్కార్ నిర్ణయం తీసుకుని.. దాన్ని అమలు చేసింది. అలాగే జూలై నెలాఖరు వరకు లక్షన్నర.. ఆగష్టు 15 నాటికిమొత్తం రెండు లక్షల రుణాబకాయిలను రైతుల తరఫున ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించేలా ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 18న సాయంత్రం ముఖ్యమంత్రి రుణమాఫీని విడుదలచేశారు. లక్ష వరకు రుణాలు మాఫీ చేసినట్లు ప్రకటించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోంది. అందులో ముఖ్యమైనది రైతురుణమాఫీ. అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ రైతాంగానికి రెండులక్షణ రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హాయంలో చేయలేనిది తాము చేసి చూపిస్తామని చెప్పడమే కాదు.. చేసి చూపించారు సీఎం రేవంత్. ఇప్పటికే లక్ష రుణాలు మాఫీ చేసిన కాంగ్రెస్... రెండో విడత రుణమాఫీకి రంగం సిద్ధం చేసింది. మంగళవారం రెండో విడత రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లక్షన్నర లోపు ఆరు లక్షల మంది రైతులకు రుణాలను మాఫీ చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వనికి ఏడు వేల కోట్లు అవసరం. గతంలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం12 లక్షల మందికి ఆరు వేల కోట్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. సుమారు పదకొండున్నర లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 7వేల కోట్లు జమ చేసినట్లు వివరించారు. నిధులు విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా లబ్దిదారులు రైతువేదికల వద్ద సంబురాలు చేసుకున్నారు. రైతు రుణమాఫీకి రూ. 31 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. రుణమాఫీ నిధులను వేరే అప్పులకు జమ చేయవద్దని ఇప్పటికే బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల రుణమాఫీ పథకం వర్తిస్తుం దని చెప్పారు. కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామని, రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. బ్యాం కుల్లో రుణమాఫీ నగదు జమ చేయడంతో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లబ్దిదారులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. రైతు కుటుంబాన్ని గుర్తించడానికి ఆహార భద్రతాకార్డు వివరాలు ప్రామాణికంగా రుణమాఫీ ఉంటుందని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. సెంబరు 12, 2023 నాటికి రైతుకు ఉన్న రుణం, లేక రెండు లక్షల వరకు ఏది తక్కువైతే దాన్ని పొందేందుకు రైతులు అర్హులు. అలాగే రెండు లక్షల మించిన రుణం ఉన్న రైతులు ఆపైన ఉన్న రుణాన్ని మొదట చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన ఉండగా, ఆ తరువాతనే రుణమాఫీ పొందే వెసులుబాటు కల్పించింది.



# విద్యుత్‌పై వాడీవేడీ చర్చ

- జగదీశ్ రెడ్డి హత్య కేసులో నిందితుడు
- మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలతో మండిపాటు

**హైదరాబాద్, ప్రజానావ:** శాసనసభలో విద్యుత్ పద్దులపై చర్చ సందర్భంగా మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. జగదీశ్ రెడ్డి హత్య కేసుల్లో నిందితుడు అని రేవంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి సీఎం, మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. తాను హత్య కేసుల్లో నిందితుడినని నిరూపిస్తే ఇదే సభలో ముక్కు నేలకు రాసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ఎందుకు జైలు జీవితం గుర్తు చేసుకుంటున్నాడో.. మళ్లీ అక్కడికే వెళ్లాలని అనుకుంటున్నాడు. నాకు కూడా చంచల్‌గూడ జైలు జీవితం గుర్తుంది. తెలంగాణ ఉద్యమం కోసం జైలుకు పోయాం. ఆయనకు చర్లపల్లినే గుర్తు ఉంటది మళ్లీ యాది చేసుకంటున్నాడు. సీఎం రేవంత్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తనపై ఆరోపణల చేసిన ప్రతి అక్షరం రికార్డుల నుంచి తొలగించాలి అని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. నేను చాలెంజ్ వేస్తున్నా.. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడిన దాంట్లో ఒక్కటి నిరూపించినా.. అందులో ఒక్కటి రికార్డు చూయించినా నేను ఈ సభలో ముక్కు నేలకు రాసి రాజీనామా చేసి పోతా.. రాజకీయాల్లో నుంచి వెళ్లిపోతా..! తప్పుని నిరూపించకపోతే కోమటిరెడ్డి, రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలి.. పదవులకు రాజీనామా చేయాలి. తాను తన చాలెంజ్‌కు సిద్ధంగా ఉన్నానని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. నేను ఎక్కడా తప్పు మాట్లాడలేదు. ఉపేక్షించం అని శాసనసభ వ్యవహారాల మంత్రి భయపెట్టిస్తున్నారు. ఒకటి కాదు మూడు హత్య కేసులు పెట్టారు తనపై అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మూడింటింలో కోర్టు నిర్దోషిగా తేల్చింది. తెలంగాణ ఉద్యమం కేసులు తప్ప.. వేరే కేసులు లేనే లేవు. పెట్రోల్ బంక్ దొంగతనం కేసు, మిర్యాలగూడ కేసు మీద హౌస్ కమిటీ వేయండి.. ఒక్క కేసు నా మీద ఉన్న ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాను. నిరూపించకపోతే సీఎం, మంత్రి కూడా ముక్కునేలకు రాసి రాజీనామా చేయాలి అని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# వచ్చే ఏడాది ఆసియా కప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్

## టీ20 ఫార్మాట్‌లో జరుగనున్న టోర్నీ..!




**ముంబై:** వచ్చే ఏడాది పురుషుల ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరుగనున్నది. ఈ ఆసియా కప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నది. అయితే, 2027లో బంగ్లాదేశ్‌లో నిర్వహించనున్న ఆసియా కప్ 50 ఓవర్ల ఫార్మాట్ జరుగనున్నది. 2023లో ఆసియా కప్‌ను హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన విషయం తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా.. పాక్‌కు ఆతిథ్య హక్కులు లభించగా.. టీమిండియా మ్యాచులన్నీ శ్రీలంక వేదికగా జరిగాయి. రోహిత్ శర్మ కెప్టెన్సీలో, కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో శ్రీలంకను 10 వికెట్ల తేడాతో ఓడించిన భారత్ టైటిల్‌ను కైవసం చేసు కుంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ జారీ చేసిన స్పాన్సర్‌షిప్ హక్కుల కోసం నిర్వహించిన బిడ్డింగ్‌లో భారత్ ఆతిథ్య హ క్కులను దక్కించుకున్నది. మొత్తం 13 మ్యాచులు జరుగ నుండగా.. భారత్, పాకిస్థాన్, శ్రీలంక,బంగ్లాదేశ్, ఆఫ్ఘని స్థాన్‌తో పాటు మరో జట్టును క్వాలిఫైయింగ్ ఈవెంట్ ద్వారా ఎంపిక చేయబడింది.అయితే, మ్యాచులు జరిగే తేదీలను ఖరారు చేయనప్పటికీ.. భారత్‌లో వర్షాకాలం ముగిసిన అనంతరం సెప్టెంబర్‌లో నిర్వహించ వచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రాం 2023-27 ప్రకారం.. భారతదేశం వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడనున్నది. ఆ తర్వాత ఫిబ్రవరి-మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొననున్నది. ఆ తర్వాత ఐపీఎల్ ఉంటుంది. అనంతరం వన్డేలు, టీ20 సిరీస్ కోసం బంగ్లాదేశ్‌కు వెళ్లేముందు జూన్ నుంచి ఆగస్టు వరకు ఇంగ్లాండ్‌లో పర్యటించనున్నది. బంగ్లాదేశ్ సిరీస్ అనంత రం అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో జరిగే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందు ఆసియా కప్ నిర్వహించాలని భావిస్తున్నారు. అయితే, వేదికలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకో లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. 2026లో పురుషు ల ఆసియా కప్ టోర్నీ ఉండదు. మహిళల ఆసియా కప్ ఆ సంవత్సరం టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు.



# క్రికెట్ అభివృద్ధికి భారీ ప్రణాళిక

- స్టేడియాల నిర్మాణానికి భూములు కావాలని సర్కార్‌ను కోరిన హెచ్‌సీఏ
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ పరిసరాల్లో 100, ఉమ్మడి జిల్లాల్లో 25 ఎకరాల సమీకరణకు కసరత్తు

**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** రాష్ట్రంలో క్రికెట్ సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా ప్రతి జిల్లాలో ఒక స్టేడియం నిర్మించాలని, అలానే ప్రస్తుత అవసరాల దృష్ట్యా హైదరాబాద్‌లోనూ మరో అంతర్జాతీయ స్టేడియం కట్టాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కోశాధికారి సీజే శ్రీనివాస్ సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించారు. సోమవారం సీఎం కార్యాలయంలో హెచ్‌సీఏ వినతిపత్రాన్ని రేవంత్ రెడ్డికి శ్రీనివాస్ సమర్పించారు. ఈ లేఖలో ప్రధానంగా హైదరాబాద్ పరిసరాల్లో నూతన స్టేడియం కట్టడానికి ప్రభుత్వ ధర ఆధారంగా 100 నుంచి 120 ఎకరాలు కావాలని జగనమోహన్ రావు కోరారు. 'ప్రస్తుతమున్న ఉప్పల్ స్టేడియం 37 వేల సీటింగ్ సామర్థ్యమే కావడంతో అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచలు జరుగుతున్నప్పుడు అభిమానులు ఇబ్బందులకు గురువతున్నారు. పార్కింగ్ కూడా కేవలం 500 వాహనాలకు మాత్రమే ఉండడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అలానే ఉప్పల్ మినహా నగరంలో హెచ్‌సీఏకు గ్రౌండ్లు లేకపోవడంతో ఏటా 30-40 మైదానాలను అద్దెకు తీసుకోవాల్సి వస్తుంది. అవి బీసీసీఐ నిబంధనలకు తగినట్టు లేకపోవడంతో మ్యాచ్‌ల నిర్వహణ సాధ్యపడడం లేదు. ప్రభుత్వం భూమి చూపిస్తే అధునాతన హంగులతో ఒక లక్ష మంది మ్యాచ్‌ను చూసే సామర్థ్యం గల కొత్త స్టేడియం, అందులో ఐదు ప్రాక్టీస్ గ్రౌండ్లు, హైపెర్ఫామెన్స్ సెంటర్ నిర్మించి, రాష్ట్రంలో క్రికెట్ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పతాం' అని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రతి జిల్లాలో 25 ఎకరాల భూమి ఇస్తామని, అన్ని చోట్ల మంచి స్టేడియాలు నిర్మించి, యువ క్రికెటర్ల బంగానే భవిష్యత్‌కు బాటలు వేయాలని సీఎం రేవంత్ సూచించినట్టు శ్రీనివాస్ తెలిపారు. భూసమీకరణకు చర్యలు తీసుకోవాలని సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని రేవంత్ ఆదేశించినట్టు శ్రీనివాస్ చెప్పారు. ఇక, హెచ్‌సీఏ విజ్ఞప్తికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో ఆయనకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగనమోహన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

# క్వార్టర్ ఫైనల్‌లో సాత్విక్‌చిరాగ్ జోడీ



**పారిస్:** ఒలింపిక్స్ పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. సోమవారం వీరు ఆడాల్సిన రెండో మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేశారు. దీంతో సాత్విక్ జంట మ్యాచ్ ఆడకుండానే క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఒలింపిక్స్ పురుషుల డబుల్స్ విభాగంలో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. సాత్విక్ జోడీ సోమవారం జర్మనీకి చెందిన మార్క్‌మెర్విన్ జంటతో తలపడాల్సి ఉంది. అయితే మార్క్‌కు గాయం కావడంతో అతను ఒలింపిక్స్ నుంచి వైదొలిగాడు. దీంతో ఈ మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ గ్రూప్ దశ మ్యాచ్‌లో విజయం సాధించాడు. బెల్జియం ఆటగాడు జులియన్‌తో జరిగిన పోరులో లక్ష్యసేన్ 2119, 2114 తేడాతో జయకేతనం ఎగుర వేశాడు.

## అర్జెంటీనాతో భారత్ మ్యాచ్ డ్రా

ఒలింపిక్స్‌లో భాగంగా అర్జెంటీనాతో సోమవారం జరిగిన హాకీ మ్యాచ్‌ను భారత పురుషుల జట్టు డ్రాగా ముగించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌ను భారత్ 11తో డ్రా చేసింది. ఇటు భారత్, అటు అర్జెంటీనా అసాధారణ ఆటతో అలరించాయి. ఆరంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది.



ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరి గోల్ పోస్ట్‌పై మరోకరూ దాడులు చేస్తూ స్కోరు కోసం తీవ్రంగా శ్రమించారు. అయితే చాలా సేపటి వరకు గోల్ మాత్రం లభించలేదు. తొలి క్వార్టర్‌లో భారత్ కాస్త పైచేయి సాధించింది. అయినా గోల్ సాధించడంలో విఫలమైంది. కాగా, ఆట 22వ నిమిషంలో అర్జెంటీనా గోల్ సాధించింది. లూకాస్ మార్టినెజ్ అద్భుత గోల్‌ను నమోదు చేశాడు. దీంతో అర్జెంటీనా 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ దశలో భారత్ కూడా ఎటాకింగ్ మార్గాన్ని ఎంచుకుంది. ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై వరుస దాడులు చేసింది. పటిష్టమైన డిఫెన్స్‌తో భారత దాడులను అర్జెంటీనా సమర్థంగా తిప్పికొట్టింది. ద్వితీయార్థంలో కూడా పోరు ఉత్కంఠభరితంగానే కొనసాగింది. స్కోరు ను సమం చేసేందుకు భారత్ తీవ్రంగా శ్రమించింది. కానీ, చాలా సేపటి వరకు భారత్‌కు గోల్ లభించలేదు. అయితే మరికొన్ని నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా భారత్ అద్భుత గోల్‌తో స్కోరును సమం చేసింది. హర్మన్‌ప్రీత్ సింగ్ 58వ నిమిషంలో ఈ కీలక గోల్ సాధించాడు. దీంతో మ్యాచ్ 11తో డ్రాగా ముగిసింది. పూల్‌బిలో భాగంగా ఇంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 32 గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది.



# నేడు లంకతో చివరి టీ20

## ఇద్దరు స్టార్ ఆటగాళ్లపై వేటు

**పల్లెకెలె:** చివరిదైన మూడో టీ20 మ్యాచ్ పల్లెకెల వేదికగా మంగళవారం రాత్రి జరగనుంది. నామమాత్రమైన ఈ మ్యాచ్‌లో బెంచ్ బలాన్ని టీమిండియా పరీక్షించనుంది. ఈ విషయాన్ని రెండో మ్యాచ్ అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చెప్పాడు. ఈ క్రమంలో భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. ఓపెనర్లుగా యశస్వీ జైస్వాల్, సంజు శాంసన్ కొనసాగనున్నారు. రెండో టీ20లో గోల్డె న్ డకౌటైన శాంసన్‌కు మరో అవకాశం ఇవ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్ 3, 4 స్థానాల్లో రానున్నారు. మిడిల్ ఆర్డర్‌లో రియాన్ పరాగ్, రింకూ సింగ్ జట్టులో ఉంటారు. ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌కు విశ్రాంతిని ఇచ్చి.. శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్‌లం ఆడించాల ని చూస్తున్నారని తెలుస్తోంది. స్పెసలిస్ట్ స్పిన్ కోటాలో రవి బిష్ణోయ్ ఆడనున్నాడు. పేసర్ అర్షదీప్ సింగ్ స్థానంలో ఖలీల్ అహ్మద్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అర్షదీప్ ఇటీవల ఎక్కువగా మ్యాచులు ఆడిన విషయం తెలిసిందే.

**భారత తుది జట్టు(అంచనా):**

యశస్వీ జైస్వాల్, సంజు శాంసన్, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రియాన్ పరాగ్, రింకూ సింగ్, శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్.

# కాంస్య పతక రేసులో మను బాకర్ జోడీ



**పారిస్:** భారత సంచలన షూటర్ మను బాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో మరో పతకం సాధించేందుకు అడుగు దూరంలో నిలిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టర్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన మను బాకర్‌సరబ్‌జోత్ సింగ్ జోడీ మూడో క్వాలిఫికేషన్ రౌండ్‌లో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఈ జోడీకి కాంస్య పతకం కోసం పోరాడే ఛాన్స్ లభించింది. క్వాలిఫికేషన్ పోరులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారు పతక పోరుకు అర్హత సాధిస్తారు. ఇక తొలి రెండు స్థానాల్లో నిలిచిన షూటర్లు స్వర్ణం కోసం పోటీ పడుతారు. ఓడిన వారికి రజతం దక్కుతుంది. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారు కాంస్యం రేసులో నిలుస్తారు. కాగా, అర్హత పోటీల్లో మనుసరబ్ జంట అసాధారణ ఆటను కనబరిచింది. ప్రతికూల వాతావరణంలో అద్భుత ప్రతిభతో 580 స్కోరుతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ జోడీ తృటిలో ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకుంది. అయినా మను జంటకు పతకం గెలుచుకునే ఛాన్స్ దక్కింది. మంగళవారం కాంస్యం కోసం జరిగే పోరులో ఈ జంట దక్షిణ కొరియా జంటతో తలపడుతుంది. మ-రోవైపు పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత షూటర్ అర్జున్ బబుతా పతకం సాధించే అవకాశాన్ని కొద్దిలో చేజార్చుకున్నాడు. పతకం కోసం జరిగిన పోరులో అర్జున్ 208.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657